సాక్షి
వికారాబాద్
శుక్రవారం : 10 : మార్చి : 2023


పనులు చకచకా
ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు చకచకా సాగుతున్నాయి. కొన్ని విభాగాలకు ప్రొఫెసర్లు సైతం వచ్చారు. 8లో▸


అలుపెరగని పోరాటం చేస్తా
ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. 8లో▸


లక్ష్యం దిశగా అడుగులు
కుల్కచర్ల మండలం ఆయా గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా కార్యదర్శులు పనిచేస్తున్నారు. 9లో▸

పైకం ఇస్తేనే పని

ఓ వైపు కరెంటు కష్టాలతో సతమతమవుతున్న రైతులకు విద్యుత్ శాఖ సిబ్బంది చేతివాటం తలనొప్పిగా మారింది. చేయి తడిపితేనే ఏ పనీ జరగడంలేదు. ఇవ్వకపోతే కొర్రీలు పెడుతున్నారు. దీంతో చేసేది లేక ఇచ్చుకోక తప్పడం లేదు. పరిగి విద్యుత్ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో ఈ తంతు జోరుగా సాగుతోంది. ఉన్నతాధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. ఫలితంగా వినియోగదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విద్యుత్ శాఖలో వసూళ్ల పర్వం
- ప్రతిపనికీ మామూళ్లే..
- ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు రూ.2వేల వరకు డిమాండ్
- టి నోట్, రిజిస్ట్రేషన్‌కు రూ.500 వరకు వసూలు


పరిగిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం

పరిగి: విద్యుత్ శాఖలో వసూళ్ల పర్వం ఇష్టానుసారంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సబ్ డివిజన్ పరిధిలో పరిగి, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాలు ఉన్నాయి. పూడూర్ మండలం వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. సబ్ డివిజన్ పరిధిలో 57,825 కనెక్షన్లు ఉండగా, పరిగిలో 25,089, దోమలో 13,731, కుల్కచర్లలో 19,005 డొమెస్టిక్, కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 6,560 ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వచ్చినా సిబ్బంది సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక డబ్బులు ఇస్తేకానీ ఏ పనీ చేయడం లేదు. దీనికి తోడు అసలు సిబ్బంది పనిచేయకుండా ప్రైవేటు సిబ్బందితో పనులు చేయించి డబ్బులు వసూలు చేయిస్తుండటం గమనార్హం.

ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోతే అంతే..
వేసవి కావడంతో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా అధిక లోడు పడుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లలో తరుచూ కాలిపోతున్నాయి. దీంతో రైతులు వాటిని బాగు చేయించుకోవడానికి పరిగి పట్టణ కేంద్రానికి తెస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేయాలంటే సిబ్బందికి చేతులు తడపక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు రూ. 1500 నుంచి రూ. 2000 వరకు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే సకాలంలో పనులు చేయకుండా సతాయిస్తున్నారని తెలిపారు. ఒక్కోసారి వారం రోజులపాటు తిప్పుకుంటున్నారన్నారు. దీంతో పంటలు ఎండిన సందర్భాలు లేకపోలేదు.

రైతులపై అదనపు భారం
ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు ట్రాన్స్‌కో సిబ్బందే వాహనం సమకూర్చాలి. సబ్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన వారు పరిగికి వెళ్లి మరమ్మతులు చేయించుకోవాలి. దాదాపు 15 నుంచి 40 కిలోమీటర్ల వరకు వస్తుంది. ఇందుకుగాను దాదాపు రూ. 5వేల ఖర్చు వస్తోంది. దీంతో పాటు అక్కడికి వెళ్లే రైతులకు ఇతరత్రా ఖర్చులు వేలల్లో అవుతున్నాయి. ఇప్పటి వరకు రైతులే ఖర్చులు మొత్తం భరించుకోవడం తప్ప సంబంధిత శాఖ నుంచి ఒక్కరూపాయి కూడా రవాణా చార్జీలు ఇవ్వలేదు. ఈ తంతు ఏళ్ల తరబడి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

టీ నోట్‌కు సైతం..
ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే సంబంధిత సబ్ స్టేషన్‌లో టి నోట్ తీసుకెళ్లాలి. అది తీసుకెళ్లి మరమ్మతు కేంద్రంలో ఇస్తే గానీ పనులు చేయరు. అయితే ఇది ఏఈ ఇవ్వాల్సి ఉంటుంది. టీ నోట్ రాసే సిబ్బంది రూ. 500 తక్కువ కాకుండా తీసుకుంటున్నట్లు సమాచారం. రాజకీయ నాయకులు పలుకుబడి ఉన్న వారు వెళ్తే వారి వద్ద కూడా రూ. 200 వసూలు చేస్తున్నారు. ఇక అదనపు మీటర్ కావాలన్నా, కొత్త కనెక్షన్లు కావాలన్నా దానికి సంబంధించిన ఏ పనికైనా పైకం చెల్లించాల్సిందే. ఇవ్వకపోతే ముప్పు తిప్పలు పెడతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

గ్రామ స్థాయి నుంచి..
విద్యుత్ శాఖలో గ్రామస్థాయి మొదలుకొని మండల, సబ్ డివిజన్ స్థాయి వరకు వసూళ్ల పర్వం కొనసాగుతోంది. ఆఖరికి సర్వీసు వైరు వేయాలన్నా చేయి తడపాల్సిందే. ఫ్యూజ్ వైరుకు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు, జంపర్లు వేయాలన్నా ఇలా ఏ పనికైనా డబ్బులు అడుగుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ బకాయిలు చెల్లించి తర్వాత తిరిగి కనెక్షను పునరుద్ధరించడానికి కూడా డబ్బులు అడుగుతుండటం గమనార్హం. కాంట్రాక్టు లేబరు మొదలు కొని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఇలా ప్రతి ఒక్కరూ తమ తమ స్థాయిలో చెయ్యి చాస్తున్నారు. ఇవ్వని పక్షంలో రాత్రివేళ సైతం కరెంట్ లేకుండా చేస్తున్నారంటే ఒక్కో సారి రాత్రి కరెంటు లేకుండా చీకట్లో ఉండేలా చేస్తున్నారంటే ఎంత బరితెగించారో అర్థం అవుతోంది. కొన్ని గ్రామాల్లో వారు సకాలంలో స్పందించకపోతే ప్రైవేటు వ్యక్తులతో చేయించుకుంటున్నారు. వారు సైతం రాకపోతే ప్రాణాలను సైతం తెగించి మరమ్మతులు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది.

పైసలు అడుగుతుండ్రు



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గుర్తైతే డబ్బులు ఇవ్వనిదే పని చేయడంలేదు. చాలా సార్లు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించా. పరిగిలో దాదాపుగా రూ.2వేల వరకు అడుగుతున్నారు. రానుపోను ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కూడా మేమే భరిస్తున్నాం. పైసలు ఇస్తేనే విద్యుత్‌కు సంబంధించిన పనులు చేస్తున్నారు.

– బషీర్, రైతు, బొంపల్లి

ఫిర్యాదు చేయండి



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం ఎలాంటి డబ్బులు ఇవ్వకూడదు. ఉచితంగానే చేయిస్తున్నాం. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌పోర్టు డబ్బులు రైతుల ఖాతాల్లోనే జమ అవుతాయి. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువచ్చిన వారి వివరాలను సేకరించి ఉన్నత అధికారులకు పంపిస్తున్నాం.

– మోసిన్, ఏఈ, ఎస్పీఎం పరిగి


వికారాబాద్ బాలుర పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు వేగిరం చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం అదనపు కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల నోడల్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులైన విద్యుత్, ఫ్యాన్లు, తాగు నీరు, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నోడల్ అధికారులు బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ మెటీరియల్ అన్ని పరిశీలించి సిద్ధం కావాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లపై పోలింగ్ స్టేషన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా స్టిక్కర్లు వేయాలన్నారు. రూట్ ఆఫీసర్లు ఐదు రూట్లలో ఐదు వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అప్పగించిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ సమర్థంగా నిర్వహించాలన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే తనను సంప్రదించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

హెచ్‌ఎంపై బదిలీ వేటు
వికారాబాద్ అర్బన్: విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా, నాణ్యత లోపించినా సహించేది లేదని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనానికి ఇచ్చిన సరుకులకు సరి పోకపోవడంతో పాఠశాల హెచ్‌ఎం శ్రీహరిపై బదిలీ వేటు వేశారు. కొంత మంది ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి వెళ్లి ఆలస్యంగా రావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో పాఠశాలకు తిరిగి వస్తానని, మార్పు కనిపించాలని లేకుంటే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మురళీధర్, జిల్లా పరిషత్ సీఈఓ జానకీ రెడ్డి పాల్గొన్నారు.

హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడి


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

- 27 సిలిండర్లు సీజ్

పరిగి: పట్టణ కేంద్రంలోని పలు హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్న హోటళ్లలో సోదాలు చేశారు. మొత్తం 27 సిలిండర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లను కేవలం ఇంటి అవసరాలకు మాత్రమే వాడాలని సూచించారు. హోటళ్లలో ఇతర వాటికి వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

ఏఎస్‌ఐని మాట్లాడుతున్నా.. రూ.20 వేలు పంపు

ఓ సైబర్ నేరగాడి మోసం

దౌల్తాబాద్: 'తాను ఏఎస్‌ఐని మాట్లాడుతున్నా.. అర్జంట్‌గా రూ.20వేలు ఫోన్ పే ద్వారా పంపు.. మా కానిస్టేబుల్ ద్వారా 10 నిమిషాల్లో పంపుతున్నా' అని సైబర్ నేరగాడు ఓ వ్యక్తికి ఫోన్ చేసి డబ్బులు ఖాతాలో వేసుకుని మాయమయ్యాడు. ఈ సంఘటన దౌల్తాబాద్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని సురాయిపల్లికి చెందిన అమ్మికుంట్ల నాగప్ప దౌల్తాబాద్‌లో మీసేవ కేంద్రాన్ని నడిపిస్తున్నాడు. అయితే నాగప్ప పని ఒత్తిడిలో ఉన్న సమయంలో 76739 41381 నంబర్ నుంచి తాను ఏఎస్‌ఐ అశోక్‌ను మాట్లాడుతున్నా.. హాస్పిటల్ అవసరం కోసం 9700110078 నంబర్‌కు రూ.20వేలు ట్రాన్స్‌ఫర్ చేయి. డబ్బులు కానిస్టేబుల్ ద్వారా పంపుతున్నా అని చెప్పాడు. అయితే పని ఒత్తిడిలో ఏఎస్‌ఐ కదా అని రూ.20వేలు ట్రాన్స్‌ఫర్ చేశారు. తీరా ఒక గంట అయినా కానిస్టేబుల్ రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుంది. వెంటనే తాను మోసపోయానని ఆన్‌లైన్‌లో సైబర్‌క్రైంకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు


మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గాలి హర్షవర్ధన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఉపాధ్యాయులకు న్యాయం జరిగిందన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే భాషాపండితులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. కేసీఆర్ తీసుకువచ్చిన 317 జీవో వల్ల ఎంతో మంది ఉద్యోగులు కష్టాలు పడుతున్నారన్నారు. వెంటనే జీవోను రద్దు చేస్తామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శాసన మండలిలో గళం విప్పాలంటే గాలి హర్షవర్ధన్‌రెడ్డి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జయశ్రీకి ప్రవచన రత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న జయశ్రీదంపతులు

అనంతగిరి: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉచితంగా భగవద్గీత బోధిస్తున్న వికారాబాద్‌కు చెందిన కొత్తూరి జయశ్రీ జగదీశ్వర్ ప్రవచన రత్న అవార్డు అందుకున్నారు. జయశ్రీ ప్రస్తుతం విశ్వ హిందూ పరిషత్ మాతృశక్తి జిల్లా సంయోజక్‌గా, గీతావాహిని ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. పట్టణంలో ఆయా వార్డుల్లో, పలు గ్రామాల్లో, భగవద్గీత ప్రవచనాలను బోధిస్తున్నారు. పలు ధార్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈమె చేస్తున్న సేవలను గుర్తించిన జహీరాబాద్ రంజోల్ రాజయోగాల ఆశ్రమం తరపున ప్రవచన రత్న అవార్డు అందజేశారు. ఆమె మాట్లాడుతూ అవార్డుతో బాధ్యత పెరిగిందని, హిందూ ధర్మ పరిరక్షణ కోసం తనవంతుగా పాటుపడుతున్నామన్నారు.

ధర్మ పరిరక్షణతోనే సమాజాభివృద్ధి

కొడంగల్ రూరల్: సంస్కృతి సంప్రదాయాలతో ధర్మాన్ని పరిరక్షించగలుగుతామని, తద్వారా సమాజం అభివృద్ధి సాధిస్తుందని కొడంగల్ జగద్గురు శ్రీనిరంజ మఠం పీఠాధిపతులు డాక్టర్ సిద్ధలింగ మహాస్వామి, కర్ణాటకలోని అల్లాపూర్, గధక్ మఠం పీఠాధిపతులు కొట్టూరేవర మహాస్వామి, ఆవీర్ మఠం పీఠాధిపతులు అన్నారు. గురువారం పట్టణంలోని జగద్గురు నిరంజన మఠంలో బసవేశ్వర స్వామివారి ఆరాధనోత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు భక్తులకు ప్రవచనాలు అందించారు. ప్రతీ ఒక్కరూ ధర్మాన్ని పాటిస్తూ దైవారాధన చేయడంతో సాధ్యం కానిది ఏదీ ఉండదని ఉద్బోధించారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, సంఘ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, సభ్యులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న డీఈఓ రేణుకాదేవి

డబ్బులు డ్రా చేసింది వాస్తవమే

- ప్రధానోధ్యాయురాలి నిర్వాకంపై డీఈఓ విచారణ
- నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్‌కు నివేదిక
- వంద శాతం పది ఫలితాలు సాధిస్తే ప్రోత్సాహకాలు
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

తాండూరు టౌన్ : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి తీర్మానం చేయకుండానే ప్రధానోపాధ్యాయురాలు డబ్బులు డ్రా చేసింది వాస్తవమేనని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. తాండూరు పట్టణం గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుశ్రీ నిధుల పట్ల నిర్లక్ష్యంగా వహించారని, తీర్మానం లేకుండానే పాఠశాల అభివృద్ధి నిధులను డ్రా చేశారని ఆరోపిస్తూ స్థానిక కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ ఇటీవలే కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం డీఈఓ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. అంతకుముందు పాఠశాల తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో రూ. 30 వేల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధుల వినియోగంపై ఎస్ఎంసీ సభ్యులతో సమావేశం నిర్వహించి తీర్మానం చేయాలన్నారు. అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా నేరుగా ఎస్ఎంసీ సభ్యులతో సంతకా లు తీసుకుని, రూ. 11 వేలు డ్రా చేయడం సరికాదన్నారు.ఈ విషయమై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

70 టెన్త్ పరీక్షా కేంద్రాలు
రాబోయే టెన్త్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 70 కేంద్రాలను సిద్ధం చేసినట్లు డీఈఓ తెలిపారు. మొత్తం 13,324 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. అలాగే 10 జీపీఏ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం చేయనున్నామన్నారు. తాండూరులోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ఫోర్జరీ చేసిన ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌ను సమర్పించారని, దీంతో వచ్చే విద్యా సంవత్సరానికి గాను పాఠశాల అనుమతిని రద్దు చేశామన్నారు. కౌన్సిలర్ సంగీత ఠాకూర్, ఎంఈఓ వెంకటయ్య గౌడ్ ఉన్నారు.

హ్యాపీ జర్నీ!

సిటీ ప్రయాణికులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

- మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు టి- 6 టికెట్
- రూ.50కే ఆరు గంటలు ప్రయాణించే అవకాశం
- కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ఎఫ్- 24
- రూ.300తో నలుగురికి ప్రయాణ సదుపాయం
- నేటి నుంచి నగరంలో అమలు: ఆర్టీసీ ఎండీ సజ్జనార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: సిటీ ప్రయాణికులకు గ్రేటర్ ఆర్టీసీ తీపికబురు అందించింది. నగరవాసులతో పాటు పర్యాటకులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. మహిళలు, సీనియర్ సిటిజన్స్ రూ.50 టికెట్‌పై 6 గంటల పాటు సిటీలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా జర్నీ చేయొచ్చు. ఫ్యామిలీ ప్యాకేజీలో భాగంగా నలుగురు కుటుంబ సభ్యులు కలిసి ప్రయాణం చేసేందుకు రూ.300తో ఎఫ్–24 టికెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ రెండు కొత్త ఆఫర్‌లు నేటి నుంచే అమల్లోకి వస్తాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ గురువారం బస్‌భవన్‌లో అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

అతివలు, వయోధికులకు ప్రయోజనం..
మహిళలు, సీనియర్ సిటిజన్ల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టి–6 టికెట్ రూ.50కు లభిస్తుంది. దీనిపై గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సిటి ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో 6 గంటల పాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఈ టికెట్‌లు చెల్లుబాటులో ఉంటాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ టికెట్‌ను బస్సులో కండక్టర్ ఇస్తారు. మధ్యాహ్నం 2 తర్వాత టి–6 టికెట్లు లభించవు. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటీజన్‌లు సైతం టి–6 టికెట్‌లపై 6 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టికెట్ తీసుకునే సమయంలో వయసు ధ్రువీకరణ కోసం కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

24 గంటల ప్రయాణ సదుపాయం..
వారాంతాలు, సెలవు దినాల్లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ప్రయాణించేందుకు వీలుగా ఫ్యామిలీ- 24 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. రూ.300 చెల్లిస్తే.. నలుగురు కలిసి 24 గంటల పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో బస్సుల్లో ప్రయాణించవచ్చు. అయిదేళ్లు దాటిన (5 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రయాణం ఉచితం) వారు ఫ్యామిలీ- 24 టికెట్ తీసుకోవచ్చు. శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ పర్యటనకు వచ్చే ఇతర ప్రాంతాలకు చెందిన వారు, వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సైతం ఈ టికెట్‌పై రోజంతా ప్రయాణం చేయొచ్చు. ప్రస్తుతం నగరంలో టి–24 టికెట్ అందుబాటులో ఉంది. దీనిపై 24 గంటల పాటు ప్రయాణం చేయవచ్చు. టీ–24 ధర పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60 చొప్పున ఉంటుంది. టీ- 24 (ట్రావెల్ యాజ్ యూ లైక్) టికెట్‌కు కొనసాగింపుగానే తగ్గింపు ధరలతో ఫ్యామిలీ-24ను ప్రవేశపెట్టారు.

టీ- 24కి అనూహ్య స్పందన..
నగరంలో అందుబాటులో ఉన్న టీ–24 టికెట్‌కు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి వరకు 33.38 కోట్ల మంది సిటీ బస్సుల్లో ప్రయాణం చేయగా, వారిలో 55.50 లక్షల మంది టీ- 24 టికెట్లను కొనుగోలు చేశారు. ప్రతి రోజు సగటున 25 వేల వరకు అమ్ముడవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ప్రయాణికులకు, పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు టి–6, ఫ్యామిలీ–24 టికెట్లను ప్రవేశపెట్టారు. 'సాధారణంగా టి–24 టికెట్ అయితే.. నలుగురికి రూ.400 చెల్లించాల్సి ఉంటుంది. ఫ్యామిలీ–24తో ముగ్గురికి రూ.300 చెల్లించి నలుగురు ప్రయాణం చేయొచ్చు' అని సజ్జనార్ చెప్పారు. ఆయా టికెట్లకు సంబంధించిన పూర్తి వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040- 69440000, 040- 23450033లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022 – 23 విద్యా సంవత్సరానికి గాను వృక్షశాస్త్రం బోధనకు అర్హత గల అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. అర్హత గల వారు ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో దరఖాస్తు సమర్పించాలని కోరారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన వారికి, బోధనానుభవం గల వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, అధికారులు

అనంతగిరి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్, డైరీని జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ సాయిబాబా, పీఓ డాక్టర్ జీవరాజ్, డాక్టర్ పవిత్ర, సీహెచ్‌సీల సంఘం అధ్యక్షుడు చంద్రప్రకాష్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి మురళీ, జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య, శ్రీనివాస్, రుణుకుమార్, సువర్ణలక్ష్మి, శ్రీనివాస్, రవీందర్, రమేష్, నస్రీన్ బేగం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి కార్మికుడి మృతి



సంజీవ్ మృతదేహం

బషీరాబాద్: మండలంలోని కొర్విచెడ్ పంచాయతీ కార్మికుడి మాల సంజీవ్(37) గురువారం ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెందాడు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంజీవ్ పంచాయతీలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అయితే ట్రాక్టర్ మరమ్మతుల కోసం మరో కార్మికుడు వవాస్‌తో కలిసి తాండూరుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా నవల్గా గేటు వద్ద ట్రాక్టర్ పైనుంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సంజీవ్‌ను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

'సహకార' సేవలు బాగు

నెదర్లాండ్ దేశ అగ్రికల్చర్ బ్యాంక్ టీం కితాబు



అధికారులతో మాట్లాడుతున్న విదేశీ బృందం సభ్యులు

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతికి సహకార సంఘం చేస్తున్న సేవలు బాగున్నాయని నెదర్లాండ్ దేశ అగ్రికల్చర్ బ్యాంక్ టీం సభ్యులు కితాబు ఇచ్చారు. గురువారం కుల్కచర్ల పీఏసీఎస్ కార్యాలయాన్ని, ధాన్యం నిల్వ గోదాంను పరిశీలించారు. అనంతరం సహకార సంఘం ద్వారా రైతులకు అందుతున్న రుణాలు, సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, ది హైదరాబాద్ బ్యాంక్ మేనేజర్ వెంకటయ్య, సహకార సంఘం బ్యాంక్ సిబ్బంది హలీం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి

సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి సీ హెచ్ రాజ్యలక్ష్మిని న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. జనాభాలో సగభాగం మహిళలు వెనకబడి ఉన్నారని, విద్యావంతులైన మహిళలు మాత్రమే రాణించగలుగుతున్నారని అన్నారు.

పనులు చకచకా

- సిద్ధమవుతున్న మెడికల్ కాలేజీ
- ప్రభుత్వం నుంచి రూ.8 కోట్ల మంజూరు
- జోరుగా సాగుతున్న నిర్మాణ, మరమ్మతు పనులు
- అనంతగిరిలో తరగతి గదుల ఏర్పాటు
- ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ల నియామకం



అనంతగిరిలోని టీబీ బ్లాక్‌లో కొనసాగుతున్న పనులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రిన్సిపాల్‌ను నియమించడంతో పాటు, కొన్ని విభాగాలకు ప్రొఫెసర్లు సైతం రావడంతో పనులు శరవేగంగా నడుస్తున్నాయి. మరో వైపు పాత టీబీ బ్లాక్‌లను తరగతి గదులకు అనుకూలంగా తయారు చేస్తున్నారు. నూతన అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని నిర్మిస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

నెరవేరనున్న కల

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నా వికారాబాద్ జిల్లా ప్రజల కల కొద్ది రోజుల్లో నెరవేరనుంది. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ సమీపంలో ఆస్పత్రి నిర్మాణ పనులు, అనంతగిరిలో తాత్కాలిక తరగతి గదులు, ల్యాబ్‌ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఒక అంతస్తుతో ఉన్న (రాజీవ్‌నగర్) వికారాబాద్ ఏరియా ఆస్పత్రిని నాలుగు అంతస్తులుగా నిర్మించి అందులోనే మెడికల్ కాలేజీ ఆస్పత్రిని కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. మెడికోల ప్రాక్టికల్స్‌కు అవసరమైన ఆస్పత్రి నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. అదనపు అంతస్తుల నిర్మాణంతో పాటు, అనంతగిరిలో టీబీ బ్లాక్‌ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇక్కడ అడ్మిషన్లు ప్రారంభమవుతాయి.

అనంతగిరిలో తరగతి గదులు

మెడికల్ కళాశాల తరగతులు అనంతగిరిలోని టీబీ మానిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ 25 నుంచి 30 మంది మాత్రమే టీబీ రోగులు ఉండటంతో వారికి రెండు బ్లాక్‌లను మాత్రమే కేటాయించారు. మిగిలిన తొమ్మిది బ్లాక్‌లను మెడికల్ కళాశాల కోసం తీసుకున్నారు. ఇందులో అవసరమైన మార్పులు, నిర్మాణ పనులు చేస్తున్నారు. టీబీ ఆస్పత్రిలో ఆయా కేటగిరీల్లో ఉన్న సుమారు 130 మంది ఉద్యోగులను కూడా మెడికల్ కాలేజీకి కేటాయిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. మెడికల్ కళాశాల ప్రారంభం కాగానే టీబీ ఆస్పత్రి సిబ్బంది అటు వెళ్లిపోనున్నారు. కొద్ది రోజులుగా ఏరియా ఆస్పత్రిని డిస్ట్రిక్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు అప్పగించారు.

నిబంధనల మేరకు

ప్రభుత్వ నిబంధనల మేరకు మెడికల్ కళాశాలకు ఉండాల్సిన అన్ని ఏర్పాట్లను ఆయా విభాగాల అధికారులు దగ్గరుండి చూసుకుంటున్నారు. మెడికల్ కాలేజీకి అనుమతి ఇచ్చే ముందు అన్ని సదుపాయాలను పరిశీలించనున్నారు. ఇందులో భాగంగా త్వరలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారుల బృందం ఇక్కడకు రానున్నట్లు చెబుతున్నారు. మెడికల్ కళాశాలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు, నిబంధనల ప్రకారం పడకల సామర్థ్యం, ప్రసూతి, ఆపరేషన్ థియేటర్, చిన్ని పిల్లల వార్డులు, వైద్య సిబ్బంది, వైద్యులు, టీచింగ్, ఓపీ సంఖ్య వంటి వివరాలను పరిశీలించనున్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. రంగాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో, నారాయణపూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న 32 ఎకరాల ప్రభుత్వ భూములను కొంత మంది రియల్టర్లు ఆక్రమించారని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో డబుల్ బెడ్ రూంలు, సొంత జాగా ఉన్న వారికి డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చారని, అది నేటికీ అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

బషీరాబాద్: సైబర్ నేరగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని గొట్టిగఖుర్దు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించ కూడదన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామీణులు కూడా ఎక్కువగా ఆన్‌లైన్ పేమెంట్స్ చేస్తున్నారని, అందుకే సైబర్ నేరగాళ్ల చేతిలో ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి, డబ్బులు కాజేస్తున్నారన్నారని, ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రాప్ బుకింగ్ యాప్‌తో పంటల తనిఖీ

మోమిన్‌పేట: మండల పరిధిలోని బూర్గుపల్లిలో గురువారం జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతు క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. క్రాప్ బుకింగ్ యాప్‌తో యాసంగిలో వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంట వివరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో సాగు అవుతున్న ఉద్యాన, కూరగాయ పంటలు కూడా నమోదు చేయయాల్సిన బాధ్యత వ్యవసాయ విస్తరణ అధికారులపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు పంటల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ చంద్రిక, సర్పంచ్ మానయ్య, ఉప సర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి, రైతులు వీరేశం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

బషీరాబాద్: ఎక్మాయి సమీపంలోని అంబబాయి వాడుకలో అక్రమంగా ఇసుక తరలించడానికి ప్రయత్నించిన రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాపూర్ గ్రామానికి హేమంత్, నంద్యానాయక్ తండాకు చెందిన చౌవన్ రూప్లా ఇద్దరు తమ ట్రాక్టర్లతో ఇసుక నింపడానికి అంబబాయి వాడుకలో నిలిచి ఉండగా గమనించిన పోలీసులు రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా వీరు తరచూ ఇసుక అక్రంగా రవాణా చేస్తుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం సమత

వికారాబాద్ డీఎం సమత


ధారూరు: వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను అవసరం ఉన్నవారు వినియోగించుకోవాలని వికారాబాద్ డీఎం సమత సూచించారు. గురువారం ధారూరు బస్టాండ్‌ను సందర్శించిన ఆమె అక్కడి ప్రయాణికులతో మాట్లాడారు. ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమంలో భాగంగా సంస్థ ఇస్తున్న రాయితీలను పొందాలని పేర్కొన్నారు. ధారూరు బస్టాండులో నెలకొన్న సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు. బస్టాండులో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఆనంద్

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడుతూ చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ (మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి పి.ఆనంద్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె.శివ డిమాండ్ చేశారు. గురువారం మాదిగల సంగ్రామ యాత్ర కొడంగల్‌కు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై బీజేపీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతూ ఆమోదించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు యూ.రమేష్‌బాబు, నాయకులు దస్తప్ప, ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మురళీకృష్ణాగౌడ్



తాండూరు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్ నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందించారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలతో మురళీకృష్ణాగౌడ్ పార్టీలో గుర్తింపు పొందారు. దీంతో అతడిని రాష్ట్ర కార్యవర్గంలో సభ్యులుగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేకర్, జిల్లా అధ్యక్షులు సదానంద రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలలో పర్యటించి పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తానన్నారు.

నా చావుకు భార్య, అత్తే కారణం

కందుకూరు: నా చావుకు భార్య, అత్తే కారణమంటూ ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కృష్ణంరాజు కథనం మేరకు.. మండలంలోని పెద్దమ్మ తండాకు చెందిన సభావత్ జీవన్(21)కు రెండేళ్ల క్రితం బాలాపూర్ మండలం కుర్మగడ్డ తండాకు చెందిన లావణ్యతో వివాహం జరిగింది. జీవన్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్ బండ్లగూడలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. వారికి ఆరు నెలల బాబు ఉన్నాడు. కొంత కాలంగా భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యతో పాటు అత్త లక్ష్మి, బావమరిది రమేష్ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టేవారు. దీంతో మనస్థాపం చెందిన జీవన్ భార్యను అక్కడే వదిలేసి మూడు రోజులుగా పెద్దమ్మ తండాకు వచ్చి ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. అతను రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అవకాశం ఇస్తే అలుపెరగని పోరాటం చేస్తా

ఉపాధాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

అనంతగిరి: ఉపాధాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదారాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్‌లోని గౌతమి జూనియర్ కళాశాలలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే ఉపాధ్యాయు, అధ్యాపక సంక్షేమం కోసం పోరాటం చేస్తానన్నారు. 2017లో జరిగిన ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచానని, ఈసారి తప్పకుండా ఓటు వేసి గెలిపించి శాసన మండలికి పంపాలని ఆయన కోరారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థ కుంటుపడిందని, దాన్ని గాడిలో పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ లేక నిరుద్యోగులు ఎక్కువవుతున్నారని దాన్ని ప్రశ్నించేవారు లేరన్నారు. బ్యాలెట్ పత్రంపై 17వ క్రమ సంఖ్యలో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్స్ ప్రధాన సంపాదకులు నర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు, కార్యదర్శులు, పవన్, రత్నం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకే 'డీఎస్పీ'

మహేశ్వరం: దేశంలో అణగారిన వర్గాల విముక్తి కోసం రూపొందించిన రాజ్యాంగాన్ని రక్షించడానికి పుట్టిందే డీఎస్పీ అని దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం మండలంలోని దుబ్బచర్ల, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాలకు స్వరాజ్య పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అగ్రకులాల చేతిలో బడుగు బలహీన వర్గాలు అణచివేతకు గురవుతున్నారని అన్నారు.

సీటీఓ యాప్‌లో పంటల వివరాలు



పంట వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: సీటీఓ యాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేస్తామని జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ నిరంజన్‌రావు తెలిపారు. గురువారం మండల పరిధిలోని మదన్‌పల్లిలో సీటీఓ యాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహించిన సమయంలో రైతులు, ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు.





ఇబ్రహీంపట్నం రూరల్: పటేల్‌గూడలో ప్రచారం చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు, కరపత్రం ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

పోటాపోటీగా ఎమ్మెల్సీ ప్రచారం

పీఆర్‌టీయూ ఓ వైపు యూటీఎఫ్ మరో వైపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రచారం జోరందుకుంది. ఇబ్రహీంపట్నం మండలం, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు జోరుగా ప్రచారం సాగించారు. మొదటి ప్రాధాన్యత ఓటు మా అభ్యర్థికే వేయాలని కోరుతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రదక్షిణలు చేస్తున్నారు. గురువారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఏవీఎస్, శ్రీదత్త, భారత్, శ్రీఇందు, విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు పరమేష్, హన్మకొం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, భానుప్రసాద్‌రెడ్డి, దయాకర్, మధుసూదన్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కోటయ్య, వీరబాబు, నరేష్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, లింగరావు, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, శ్రీకాంత్, అంకులయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం పీఆర్‌టీయూ నేతలు ఎల్మినేడు, ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలల్లో, బొంగ్లూర్ ఆదర్శ పాఠశాలలో ప్రచారం జోరుగా నిర్వహించారు. విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, కిరణ్ కుమార్, రవి, ఆనంద్, శ్రీనివాస్, బాలాజీ, ప్రవీణ్‌కుమార్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించండి

మంచాల: టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్న గారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. గురువారం మంచాల మండలం మంచాల, రంగాపూర్, ఆరుట్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూళ్లలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న వ్యక్తి మాణిక్‌రెడ్డి అన్నారు. అతనికి మొదటి ప్రాధాన్యత ఓటు చేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల గాలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుగంధ, జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్, మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్, యాచారం మండల అధ్యక్షుడు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు మోతీలాల్, మండల క్యాదర్శి వెంకటాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినయ్‌బాబాను గెలిపించాలి

చేవెళ్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ అర్రం వినయ్‌బాబాను గెలిపించాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వ్యవస్థపక అధ్యక్షుడు వీ సత్యనారాయణ కోరారు. మండలంలోని ముడిమ్యాల, గొల్లపల్లి సమీపంలో ఉన్న కొండగల్, వాబుపేట గురుకుల పాఠశాలల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల అధ్యాపకుల, ఉపాధ్యాయుల కోసం తన జీవితాన్ని తాగ్యం చేసిన ప్రొఫెసర్ అర్రం వినయ్‌బాబాను ఎమ్మెల్సీగా గెలిపించుకుంటే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఆయన నిరతరం కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కొండగల్ గురుకుల పాఠవాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, నవాబుపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కే వెంకట్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశంపేట మండలంలో..

కేశంపేట: మండలంలో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. నిద్రవెల్లి, కాకునూరు, కొండారెడ్డిపల్లి, వేములనర్వ, పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ సంఘం నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రంగారెడ్డి, మహేందర్, శ్రీనివాస్‌సాగర్, కరుణాకర్, నందిగామ సురేష్, అబ్దుల్‌చారి, రాంకిసన్, సోంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి తరఫున ఎస్‌ఎస్‌యూఐ నాయకులు మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కందూరి శివ ప్రసాద్, సందీప్, మహేష్, విష్ణు, సాయి బన్నీ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: కొండగల్ పాఠశాలలో ప్రచారం చేస్తున్న సత్యనారాయణ



మంచాల: ఆరుట్ల మోడల్ స్కూల్‌లో ప్రచారం చేస్తున్న రవి తదితరులు